క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్ఎం రవి, సిబ్బంది

కందుకూరు: మండల పరిధిలోని బాచుపల్లి ప్రభుత్వ పాఠశాల నుంచి బదిలీ అయి వెళ్తున్న ఉపాధ్యాయులు కె.సూర్యప్రభ, ఎం.మల్లికార్జున్‌ను గురువారం ప్రధానోపాధ్యాయుడు రవి, మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. వారు విద్యాభివృద్ధికి చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ లూషమ్మ, ఉపాధ్యాయులు జంగయ్య, మధు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



గణేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: భారతీయ జనతా పార్టీ యువ జన మోర్చా (బీజేవైఎం) రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన గణేశ్‌కు గురువారం జిల్లా కమిటీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు లిక్కి విజయేందర్‌రెడ్డి, కార్యదర్శి ఈరంకి విశ్వనాథ్‌గౌడ్ ఆయనను పార్టీ కార్యాలయంలో కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. జిల్లాలో యువతను పార్టీ వైపు ఆకర్షిస్తూ.. రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను ఘన విజయంతో గెలిపించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



ధన్నారంలో పనులను పర్యవేక్షిస్తున్న డీపీఓ సురేశ్‌మోహన్

కందుకూరు: మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో గురువారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా గ్రామంలో పిచ్చిమొక్కల తొలగింపు, పారిశుద్ధ్యం పనులు చేపట్టారు. కాగా డీపీఓ సురేష్ మోహన్ ధన్నారం గ్రామాన్ని ఆకస్మిక సందర్శించి పనులను పరిశీలించారు. పులిమామిడిలో ఎంపీడీఓ సరిత, ఎంపీఓ గీత, పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలి

టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి



మున్సిపాలిటీ కార్యాలయం వద్ద చల్లా నర్సింహారెడ్డి, నాయకులు

పహాడీషరీఫ్: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం ఎప్పటికప్పుడూ ప్రత్యేక చర్యలు చేపడుతుందని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులు, సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి పనుల విషయమై కమిషనర్ బి.వెంకట్రామ్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సమస్యలను పరిష్కరించాలని పలు సూచనలు చేశారు. నిధుల సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట జల్‌పల్లి మున్సిపల్ సీనియర్ నాయకులు షేక్ జహంగీరుద్దీన్, చింతకింది నవీన్, ఎంఏ బారీ, నవాజ్ తదితరులు ఉన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.23, వంకాయ రూ.23, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.37, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.19, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.23, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.23, మునగ రూ.105, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.31, కీర రూ.23, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.40. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ఆదాయం ఘనం.. సౌకర్యాలు శూన్యం



సరూర్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సమస్యల తిష్ట

- కూర్చునేందుకు కుర్చీలు.. తాగేందుకు నీరు నిల్
- కనీస అవసరాలకు కరువే
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది, ప్రజలు



భూ క్రయవిక్రయదారులతో రద్దీగా ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయం

హుడాకాంప్లెక్స్: ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో ఆదాయాన్ని సమకూర్చుతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కనీస సౌకర్యాలు కొరవడ్డాయి. దీంతో రోజంతా ఆఫీసులో పని చేస్తున్న ఉద్యోగులే కాదు, స్థిరాస్తి వ్యాపారులు, భూముల క్రయవిక్రయదారులు, డాక్యుమెంట్ రైటర్లు ఇలా నిత్యం ఇక్కడికి వచ్చే వారంతా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

రోజుకు 40పైనే..

సరూర్‌నగర్ ఎంపీడీఓ ఆఫీసు సమావేశం హాలులో.. ప్రభుత్వం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఇక్కడ రోజుకు కనీసం 40 నుంచి 50 రిజిస్ట్రేషన్లు అవుతుంటాయి. ఒక్కో డాక్యుమెంట్ కోసం సగటున ఐదు నుంచి ఆరుగురు ఇరు పక్షాల నుంచి వస్తుంటారు. ఇలా నిత్యం సుమారు ఐదారు వందల మంది వచ్చిపోతుంటారు. రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ, ఇతర ఫీజుల రూపంలో ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో ఆదాయం వస్తోంది.

అన్నింటికీ ఉగ్గపట్టాల్సిందే..

సర్కారుకు భారీగా ఆదాయం తెచ్చిపెడుతున్న కార్యాలయంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. సంబంధిత అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వలన మౌలిక సదుపాయాలు మృగ్యమయ్యాయి. కనీసం కూర్చునేందుకు కుర్చీలు లేవు. తాగేందుకు నీరు లేదు. ఇక మలమూత్ర విసర్జన కోసం సుదూర ప్రాంతాల్లోని.. మరుగుదొడ్లు, లేదా పక్కనే ఉన్న వికలాంగుల శాఖ జిల్లా కార్యాలయంలోకి పరుగు తీయాల్సి వస్తోంది. మహిళల ఇబ్బందులు చెప్పలేనివి.

పార్కింగ్ లేదు



రిజిస్ట్రేషన్ల కోసం పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు వాహనాల రాకపోకలతో ఆ ప్రాంతమంతా రద్దీగా ఉంటోంది. కానీ రిజిస్ట్రేషన్ కార్యాలయ ప్రాంగణంలో పార్కింగ్ సౌకర్యం లేదు. దీంతో ప్రధాన రహదారిపైనే వాహనాలను నిలుపుతున్నారు. దీని వలన నిత్యం ట్రాఫిక్ కష్టాలతో పాటు.. ప్రమాదాలు జరుగుతున్నాయి.

– జహీర్, వార్డు కమిటీ సభ్యుడు

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా

కందుకూరు: ఉపాధి కూలీలు, గ్రామ పంచాయతీ కార్మికులకు అందాల్సిన పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట లబ్ధిదారులతో ధర్నా నిర్వహించారు. అనంతరం సీఐటీయూ మండల నాయకుడు రాయికంటి శేఖర్ కార్మికులతో కలిసి ఎంపీడీఓ సరితకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి జగన్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ మాట్లాడారు. నెలల తరబడి కార్మికులకు వేతనాలు అందించకుండా వారిని ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ప్రతి ఏడాది రెండు జతల దుస్తులు, గ్లౌజులు, మాస్కులు, ఐడెంటిటీ కార్డులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మరోపక్క ఉపాధి హామీలో పని చేసే కూలీలకు నాలుగు నెలలుగా జీతాలు పెండింగ్ ఉన్నాయన్నారు. ఉపాధి హామీని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికే ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వెంటనే పెండింగ్ వేతనాలు అందించాలని, పని సామగ్రి ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బుడ్డీరపు శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు అంకగళ్ల కుమార్, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు మాదారం నర్సింహ, ఉపాధి కూలీలు, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

మొయినాబాద్ రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలు దరిచేరవని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాంనగర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని బాకారం జిల్లా పరిషత్ పాఠశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు కలిసి మండల కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని పాఠశాలలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిచ్చిమొక్కలు తొలగించి, గుంతలు పూడ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతోనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ విద్యనభ్యసిస్తారన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రధాని మోదీ దేశంలోని స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఓబీసీ కన్వీనర్ ఎల్గని శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి హామీనిచ్చారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్జర్ల ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్య తీవ్రంగా ఉందని ఉపాధ్యాయులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలన్నారు. పాఠశాలకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు తప్పకుండా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని స్పష్టం చేశారు. పాఠశాలలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూస్తానని హామీనిచ్చారు. అదేవిధంగా గ్రామానికి చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు అశోక్‌రెడ్డి, శివరాజ్‌గౌడ్, తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన కుమ్మరి రాములు అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి గ్రామానికి చేరుకొని ఆయన భౌతికకాయానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న బీఆర్ఎస్ గ్రామ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

కందుకూరు: శ్రీశైలం హైవే అవేర్ ఆస్పత్రి నుంచి తిమ్మాపూర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షణీయమని బీజేపీ మహేశ్వరం అసెంబ్లీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చొరవతో కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సీఆర్ఐఎఫ్ నుంచి రూ.38 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. అవేర్ ఆస్పత్రి నుంచి లేమూరు మీదుగా అగర్‌మియాగూడ, తిమ్మాపూర్ వరకు 14 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం చేపట్టనున్నారన్నారు. కేంద్ర మంత్రులతో పాటు ఎంపీకి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

పేరుకుపోతున్న చెత్త

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని పలుకాలనీల్లో చెత్తా చెదారం భారీగా పేరుకుపోతోంది. స్పెషల్ డ్రైవ్ నిర్వహించామంటున్న అధికారులకు తమ కాలనీలు, బస్తీల్లోని చెత్త కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తాత్కాలికంగా పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్, హరిపురికాలనీ, జనప్రియకాలనీ, కృష్ణానగర్, సిరినగర్‌కాలనీ, సౌభాగ్యపురంకాలనీలో చెత్త కుప్పలు భారీగా పేరుకుపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకోవాలని కాలనీ,బస్తీల వాసులు కోరుతున్నారు.

బోర్‌వెల్ పనుల ప్రారంభం

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద ఎమ్మెల్సీ నిధులతో ప్రారంభించిన బోర్‌వెల్ పనులను గురువారం ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు అవసమరైన నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. బొగ్గారపు శరత్‌చంద్ర, శశిదర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థిపై ఫ్లోర్ ఇన్‌చార్జి దాడి

- గాయపడిన సాయిపునీత్
- కేసు నమోదు



సాయిపునీత్‌పై దాడిచేస్తున్న సతీష్ సీసీ ఫుటేజీ

మలక్‌పేట: విద్యార్థిపై ఫ్లోర్ ఇన్‌చార్జి దాడి చేసిన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.విద్యార్థి తల్లిదండ్రులు, పోలీసుల వివరాల ప్రకారం.. అల్మాస్‌గూడ, సాయిబాలాజీ నగర్ టౌన్‌షిప్‌కు చెందిన అబ్బయ్య కుమారుడు సాయిపునీత్ గడ్డిఅన్నారం నారాయణ జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 15న మధ్యాహ్నం కాలేజీలో ఇద్దరు విద్యార్థుల నడుమ జరిగిన వాగ్వావాదంలో ఫ్లోర్ ఇన్‌చార్జి మాలి సతీష్ జోక్యం చేసుకుని సాయిపునీత్‌పై విచక్షణంగా దాడి చేయడంతో దవడ ఎముక విరిగింది. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సతీష్‌పై కేసు నమోదు చేశామన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



కార్యక్రమంలో సీజీఆర్ సంస్థ నిర్వాహకులు, ప్రిన్సిపాల్, సిబ్బంది

కందుకూరు: కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ, పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాంను మండలంలోని నేదునూరు పరిధిలోని మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ విష్ణుప్రియ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అందులో భాగంగా ఆ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఔషధ మొక్కల తోట, ఇంకుడు గుంత, కంపోస్ట్ పిట్, కిచెన్ గార్డెన్, మొక్కల పెంపకం వంటి వాటిని సీజీఆర్ సంస్థ సభ్యుడు, వందేమాతరం ఫౌండేషన్ నిర్వాహకుడు మాధవరెడ్డి ప్రారంభించారు. రావిచెట్టు, వేపచెట్టు కలిసి ఉన్న చెట్టును తల్లి చెట్టుగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజీఆర్ సంస్థ ఏర్పాటు చేసిన ఔషధ వనంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మెంటార్లు గురు రాజారెడ్డి, పుష్పలత, ఎర్త్ లీడర్లు మాధవి, హాసిని, తేజస్విని, మధిహ, హనీప్రియ, తరుణ్, అర్చన, కో–ఆర్డినేటర్ రజనీకాంత్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



బీజేపీ క్వార్టర్స్‌లో నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో కమలనాథులు

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్ ముదిరాజ్

మీర్‌పేట: ప్రతి ఒక్కరూ ఇళ్లతో పాటు వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల రాఘవేందర్‌ముదిరాజ్ సూచించారు. పార్టీ పిలుపుమేరకు సేవాపక్షం మండల మున్సిపల్‌స్థాయి కార్యక్రమంలో భాగంగా గురువారం మీర్‌పేట బీజేపీ క్వార్టర్స్‌లో చేపట్టిన స్వచ్ఛ భారత్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఆయన వీధుల్లోని చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. ప్రధాని జన్మదినం సందర్భంగా పార్టీ పిలుపు మేరకు స్వచ్ఛభారత్ చేపట్టామని వెల్లడించారు. పార్టీ మీర్‌పేట–2 అధ్యక్షుడు ముఖేశ్‌ముదిరాజ్, నాయకులు సోమేశ్వర్, గాజుల మధు, హైందవిరెడ్డి, కసిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీకి శుభాకాంక్షలు



కందుకూరు: రంజిత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



పహాడీషరీఫ్‌లో..

కందుకూరు: చేవెళ్ల మాజీ ఎంపీ జి.రంజిత్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని మండలానికి చెందిన నాయకులు గురువారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఎస్.వెంకట్రామ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కె.పాండురంగారెడ్డితో పాటు కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాణాప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పి.మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ ఇ.రాంచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

పహాడీషరీఫ్: చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని.. గురువారం మాజీ కౌన్సిలర్ పందెం కొండల్ యాదవ్, పలువురు నాయకులతో వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. కేక్‌కట్ చేయించి, శుభాకాంక్షలు తెలిపారు.

జేఏసీ సదస్సును విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

మహేశ్వరం: మహేశ్వరంలో ఈ నెల 20న నిర్వహించనున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆవిర్భావ సదస్సును విజయవంతం చేయాలని ఆ జేఏసీ రాష్ట్ర నాయకులు రాసాల వినోద్‌యాదవ్, రాఘవేంద్రముదిరాజ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆ సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం మహేశ్వరంలో ఆవిష్కరించారు. సదస్సుకు ఆ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విశారదన్ మహారాజ్ రానున్నారని, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ నాయకులు గంట్లవెల్లి రాకేష్, అమరేందర్, హనుక్, దేవేందర్, జాషువా, రాజు ముదిరాజ్, చెన్నయ్య, రాజశేఖర్, శ్రీకాంత్, నరేశ్ పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

చేవెళ్ల: మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కాంచనలత అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది కలిసి ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని అన్ని విభాగాలకు చెందిన మహిళా అధ్యాపకులు, విద్యార్థులు పూల బతుకమ్మలను తయారు చేసి.. ఆటాపాటలతో అలరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతికి నిదర్శనంగా బతుకమ్మ నిలుస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మన సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు. వేడుకల్లో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి

వనస్థలిపురం: ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థి నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నాలుగు రోజులుగా చైతన్యపురిలో ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న అశోక్‌ను పోలీసులు వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించడంతో గురువారం ఆయన ఆసుపత్రిలో అశోక్‌ను పరామర్శించి, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల ప్రకారం రెండు లక్షల ఉద్యోగాల భర్తీ చేయడం, జాబ్ క్యాలెండర్ అమలులోనూ విఫలం అయ్యారని, గ్రూప్-1 పోస్టుల నిర్వహణలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. జిట్టా రాజశేఖర్ రెడ్డి, చింతల రవికుమార్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన

లింగోజిగూడ: లింగోజిగూడ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మతిస్థిమితం లేని ఓ వ్యక్తి ధ్వంసం చేయగా అక్కడే నూతన విగ్రహం ఏర్పాటుకు గురువారం ఎల్‌బీనగర్ సుధీర్‌రెడ్డి పలు కుల సంఘాలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తిని ఇప్పటికే అరెస్ట్ చేశారని కుల సంఘాల విజ్ఞప్తి మేరకు త్వరగా విగ్రహం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఇలాంటి ఘటనాలు జరగకుండా మహానీయుల విగ్రహాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వరప్రసాద్‌రెడ్డి, తిలక్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా..

నాగోలు: నాగోలు డివిజన్ సాయినగర్ కాలనీలో గుడిసెవాసుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ పైమీద ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెలే మాట్లాడుతూ.. త్వరలోనే సాయినగర్ కాలనీలో పర్యటించి వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ పాషా, షాహిదా బేగం, రాము, శ్రీనివాస్, రాము, మహేందర్, ధనమ్మ, అచ్చాలి నాని, వెంకటేష్, రాజు గౌడ్, మధు, ప్రమీల పాల్గొన్నారు.